

వలస జీవన పిల్లలకు విద్యా బోధన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఎదుర్లమ్మలంక గ్రామంలో సంచార జీవనం సాగిస్తున్న మత్స్యకార కుటుంబాలకు చెందిన 19 మంది పిల్లల విద్యకు ఎటువంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ కె.మాధవీలత ఒక ప్రకటనలో తెలిపారు. బడి ఈడు పిల్లలు ప్రతి ఒక్కరూ చదువుకోవాలనే ఉన్నత సంకల్పం దిశగా జిల్లా యంత్రాంగం అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. యానాంలో శాశ్వత నివాసం కలిగి, అక్కడే ఆధార్ కార్డు, రేషన్ కార్డులు కలిగిన వీరు సంచార జీవనంలో ఎదుర్లమ్మలంకలో ఏడాదికి ఐదారు నెలలు ఉంటున్నారని, వీరి పిల్లలు చదువుకోవడం కోసం చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 19 మంది పిల్లలకు నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేసి, ప్రతి రోజూ ఆ లంక గ్రామానికి ఉపాధ్యాయుని పంపి పిల్లలకు పాఠ్యాంశాలను బోధిస్తారని కలెక్టర్ తెలియజేశారు.

కొబ్బరి రైతుకు ప్రోత్సాహం కరువు

- సాగులో ఉమ్మడి జిల్లా అగ్రస్థానం
- అనుబంధ పరిశ్రమలు శూన్యం
- రైతులకు రాయితీలు కరువు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

కొబ్బరి మనకు ప్రకతి ప్రసాదించిన కల్పవక్షం. కొబ్బరి చెట్టులోని ప్రతి భాగం మానవాళికి ఉపయోగపడుతుంది. ప్రపంచ దేశాలలో కొబ్బరితో తయారైన ఉప ఉత్పత్తులకు మంచి గిరాకీ ఉంది. ఉప ఉత్పత్తులలో కోకో కెమికల్స్, కొబ్బరి పాలు తయారవుతాయి. కొబ్బరి నీరు ఆరోగ్యాన్ని కాపాడతాయి. కొబ్బరి టెంక, కొబ్బరి పీచుతో అనేక ఉపయోగాలున్నాయి. అలాంటి కొబ్బరి కోనసీమలోనే ఎక్కువగా సాగవుతోంది. జిల్లాలో పుష్కలమైన వనరులున్నా, అనేక అవకాశాలున్నా ఇక్కడి రైతాంగానికి ప్రోత్సాహం కరువైందనే చెప్పాలి.

దేశమంతా 21.40 లక్షల హెక్టార్లలో కొబ్బరి సాగవుతుండగా అత్యధికం కేరళలో 8 లక్షల హెక్టార్లు, తమిళనాడులో 5.17 లక్షల హెక్టార్లు, కర్ణాటకలో 4.65 లక్షల హెక్టార్లలో కొబ్బరి సాగవుతుంది. వాటి తర్వాత ఎపి నాలుగో స్థానంలో ఉంది. రాష్ట్రంలో 1.30లక్షల హెక్టార్లకు కొబ్బరి సాగవుతుండగా జిల్లాలో 1.36 లక్షల ఎకరాల్లో కొబ్బరి పంట పండిస్తున్నట్టు అంబాజీపేట పరిశోధనా కేంద్రం అధికారులు తెలిపారు. ఇక్కడ కొబ్బరి సాగులో రాష్ట్రంలోనే జిల్లాది మొదటి స్థానం. ఎకరాకు ఏటా సగటున 1,908 కాయలు దిగుబడి వస్తాయి. ఈ ఉత్పత్తుల విలువ సుమారు రూ.736 కోట్లుగా ఉంది. ప్రత్యక్షంగా లక్ష మంది, పరోక్షంగా మరో 3 లక్షల మందికిపైగా ఉపాధి పొందుతున్నారు.

అక్కడ రాయితీలు, ప్రోత్సాహం ఎక్కువ

కేరళలో కొబ్బరి సాగు ఎక్కువే. అక్కడి ప్రభుత్వం కొబ్బరి ఆధారిత కుటీర పరిశ్రమలను 20 ఏళ్లుగా ప్రోత్సహిస్తోంది. కాయలను నేరుగా విక్రయించే బదులు కొబ్బరి పాలను తయారు చేసి ఆహార పదార్థాల తయారీకి, ఆయిల్‌ను వంటలకు వినియోగిస్తారు. చెట్ల నుంచి తీసే నీరా పానీయాన్ని కూల్ డ్రింక్స్ మాదిరిగా పర్యాటకులకు అమ్మకాలు జరిపుతారు. కొబ్బరినూనె, కోప్రా (ఎండుకొబ్బరి), వర్జిన్ ఆయిల్, పీచు ఉత్పత్తులు, బిస్కెట్లు, పాలు, చిప్స్, వివిధ రకాల డ్రింక్స్, పౌడర్, వెనిగర్, కళాత్మక వస్తువులు, కొబ్బరి వ్యర్థాలతో ఇటుకల తయారీ పరిశ్రమలున్నాయి. అటు తమిళనాడులో కొబ్బరి నూనె పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయి. వాటికి ప్రభుత్వం రాయితీలు ఇచ్చి విద్యుత్తు ఛార్జీల భారం తగ్గించారు. అక్కడ కూడా కేరళ మాదిరిగా అనుబంధ పరిశ్రమలు ఎక్కువగానే ఉన్నాయి. పరిశ్రమల యజమానులకు ప్రోత్సాహకాలు ఇస్తున్నారు. కోయంబత్తూరు వంటి ప్రదేశాల్లో కొబ్బరి ఆధారిత పరిశ్రమలకు కావల్సిన యంత్రాలను ప్రభుత్వమే తయారు చేయించి ఇస్తుంది. దీంతో రైతులు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొస్తున్నారు. కురిడీ కాయల తయారీకి ఉచిత ఏర్పాట్లు చేస్తున్నారు.



ఇక్కడ అనుబంధ పరిశ్రమలేవి.?

తూర్పు గోదావరి జిల్లాలో 555 వరకు కొబ్బరిపీచు, తాళ్ల చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఉన్నాయి. కొబ్బరి నూనె తయారీ పరిశ్రమలు నామమాత్రంగానే ఉన్నాయి. చెట్టు నుంచి నేరుగా కాయలను దించి అమ్మడం, ధర లేకపోతే కురిడీ కాయలుగా మార్చి అమ్మడం తప్ప ప్రత్యామ్నాయం లేకుండా పోతుంది. జిల్లాలో అత్యధిక కొబ్బరి సాగు కోనసీమలోనే ఉంది. అయితే ఇక్కడ ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తే లక్షలమందికి ఉపాధి అవకాశాలు మెండుగా లభించే అవకాశం ఉంది. విపత్తుల సమయంలో చెట్లు కూలితే పరిహారం, కాలం చెల్లిన చెట్లను తొలగించి కొత్తవి వేసుకోడానికి సాయం చేస్తున్నారు. కాయల దింపు సమస్య పరిష్కారానికి కొబ్బరి వక్ష మిత్రులు పథకం ద్వారా శిక్షణ ఇస్తున్నారు. రాష్ట్రంలో పీచు, తాళ్లు, నూనె పరిశ్రమలు తప్ప ప్రభుత్వపరంగా ఇప్పటి వరకూ ఎలాంటి కొబ్బరి ఆధారిత అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేయలేదు. ప్రోత్సాహం కూడా అంతగా లేకపోవడంతో రైతులు నేరుగా కాయలను అమ్ముకోవాల్సి వస్తుంది.

నాబార్డ్ సేవలు పెరగాలి

కొబ్బరి మార్కెట్ స్థిరంగా ఉండదు. సీజన్లను బట్టి మారుతూ ఉంటుంది. ఒక్కోసారి ధరలు బాగా పడిపోయిన సమయంలో రైతులకు సమస్యలు వస్తున్నాయి. అలాంటప్పుడు నాబార్డ్ సకాలంలో జోక్యం చేసుకోవాల్సి ఉంటుంది. నిల్వ చేసుకునే సామర్థ్యం లేని సాధారణ రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కువ కాలం నిల్వ చేసుకునేందుకు అనుగుణంగా గిడ్డంగులు గానీ, కోల్డ్ స్టోరేజీలు గానీ కోనసీమలో లేవు.అందుకు తగ్గట్టుగా నాబార్డ్, ప్రభుత్వాలు వ్యవహరిస్తే రైతులకు మేలు జరుగుతుంది.

రైల్వే లైన్ పూర్తయితే మేలు

కోనసీమకు రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని సుదీర్ఘకాలంగా ఉన్న డిమాండ్ ఇప్పటికీ నెరవేరలేదు. అదే జరిగితే, కొబ్బరి ఎగుమతులను మెరుగ్గా రవాణా చేయొచ్చని, కేరళ తరహాలో కోనసీమలో కొబ్బరి వ్యాపారం విస్తరించే అవకాశం ఉంటుందని స్థానికులు అంటున్నారు. కేరళ, తమిళనాడులతో పోలిస్తే ఎపిలో కొబ్బరి పరిమాణం చిన్నదిగా ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు. అయినా, ఎపి కొబ్బరికి మంచి డిమాండ్ ఉంది. రాజస్థాన్, ఢిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్ సహా వివిధ ఉత్తరాది రాష్ట్రాలకు కూడా ఎగుమతి అవుతోంది.

ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం

20 ఏళ్లుగా కొబ్బరిసాగు చేస్తున్నాం. కొన్ని ప్రయోజనాలు తప్ప ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం లేదు. అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేస్తే రైతులు మరింతగా సాగు చేపట్టే వీలు కలుగుతుంది. ఏటా తెగుళ్ల బెడదతో నష్టాలకు గురి కావాల్సి వస్తోంది. ఇప్పటికైనా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- సుంకర సత్యనారాయణ (బాబు), రైతు, వాకలగరువు, అంబాజీపేట.

సంక్షేమం, అభ్యున్నతే ధ్యేయంగా పాలన

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభ్యున్నతే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. బుధవారం కొవ్వూరు టౌన్‌లోని 18, 19వ వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం 125వ రోజు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు ఏయే స్థాయిలో ఏయే వర్గాలకు చెందుతున్నాయో, ఏమాత్రం చెందుతున్నాయో అనే అంశాలపై హోమ్ శాఖ మంత్రి ఆరా తీసి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలైన నవరత్నాలు తదితర అంశాల్లో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఆమె తెలిపారు.కొవ్వూరు పట్టణం బాపూజీ నగర్‌లోని ఆనంద లహరి అభ్యసన ఎంపిపి స్కూల్ పిల్లలతో మంత్రి కాసేపు ముచ్చటించారు. జగనన్న విద్యాకానుక, అమ్మఒడి తదితర పథకాలను వివరించి పిల్లలు బాగా చదువుకుని మంచి అభివద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఎంతో దఢ సంకల్పంతో రాష్ట్ర అభివద్ధి కోసం ప్రవేశపెట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ప్రజాదరణ పొందుతోందని తెలిపారు. ప్రజా సంక్షేమం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల్లో



ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి వనిత

జగనన్నపై కలిగిన నమ్మకం, భరోసాతో మా నమ్మకం నువ్వే జగన్ అనే నినాదం ప్రజల నుంచి పుట్టుకొచ్చిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల అభివద్ధి కోసం నాడు నేడు, విద్యార్థుల కోసం అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, గోరుముద్ద వంటి ఎన్నో కార్యక్రమాలను చేపట్టి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 98 శాతం పైగా నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా.. వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

3వ రోజుకు ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్ర

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర బుధవారం 3వ రోజుకు చేరుకుంది. ఎస్‌సి స్కూల్ హాస్టల్ నుంచి లాలాచెరువు మున్సిపల్ ఉన్నత పాఠశాల, సుబ్బారావు నగర్ ఉన్నత పాఠశాల, ఆనంద్ నగర్ ఉన్నత పాఠశాల, శ్రీనాగరాజ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలను, ప్రతిభ ఒకేషనల్ కళాశాల, జెఎన్ఎం ఐటిఐ కళాశాలలను సందర్శించారు. అక్కడ ఉన్న సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.రాంబాబు, ఎన్.రాజా మాట్లాడుతూ పాఠశాలల్లో 30 శాతం మంది కంటే ఎక్కువ మంది మధ్యాహ్న భోజనం తినట్లేదన్నారు. ఈ ప్రభుత్వం సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం పథకం పెడతానని చెప్పి లావు బియ్యంతో పెట్టి విద్యార్థులు ఇంటి నుంచే క్యారేజీలు తెచ్చుకునే పరిస్థితి తీసుకు వచ్చిందని విమర్శించారు. ఆనంద్ నగర్ హైస్కూల్లో ప్లేగ్రౌండ్ లేదన్నారు. నూతన విద్యావిధానాన్ని



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వై.భాస్కర్ జిల్లా కమిటీ సభ్యులు మహేష్, జోసెఫ్, జ్యోతి, దుర్గ, వైష్ణవి, మరియ, వెంకటలక్ష్మి, స్వేచ్ఛ, రాజేష్, బాషా, శశి, కనక, అచ్చారావు, వర్మ, సుభాష్ పాల్గొన్నారు

'వికాసం'పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కల్పించడానికి లయన్స్ క్లబ్ సభ్యులు 'వికాసం' కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని హోమ్ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. బుధవారం కొవ్వూరులో మంత్రి క్యాంపు కార్యాయలయంలో వికాసం'పోస్టర్లను ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ గతంలో ఉమ్మడి కుటుంబాల వ్యవస్థలో పిల్లలు అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యల నుంచి మంచి విలువలు నేర్చుకునేవారని, కానీ నేటి సమాజంలో ఉమ్మడి కుటుంబాలు చిన్నాభిన్నమై.. పిల్లలపై శ్రద్ధ తగ్గుతోందన్నారు. పిల్లల బాధలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమవుతున్న వారు ఎందరో ఉంటారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వాటికి అడ్డుకట్ట వేస్తూ... లయన్‌స క్లబ్ ఆధ్వర్యంలో యుక్త వయస్సు వచ్చిన ఆడపిల్లలు తెలుసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. వికాసం డిస్ట్రిక్ చైర్మన్ కొలుకులూరి జయ ప్రకాష్ నారాయణ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో సిఐ వెంకటేశ్వరరావు

వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-నిడదవోలు

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని నిడదవోలు సిఐ కె.వెంకటేశ్వర రావు సూచించారు. అంబేద్కర్ చౌక్ సెంటర్‌లో జైభీమ్ స్పోర్ట్స్ కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ కోర్టును బుధవారం ఆయన సందర్శించారు. యువకులతో వాలీబాల్ ఆడి ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఆయన యువతను ఉద్దేశించి మాట్లాడుతూ గంజాయి, మద్యపానం, మాదక ద్రవ్యాలు, జూదం వంటి చెడు అలవాట్లకు బానిసలు కాకుండా క్రీడలు, చదువుల్లో రాణించాలని సూచించారు. క్లబ్ గౌరవాధ్యక్షుడు జువ్వల రాంబాబు మాట్లాడుతూ క్లబ్‌ను సందర్శించి యువతకు ఉత్తేజాన్ని కలిగించిన సిఐ వెంకటేశ్వర రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్ఐ షేక్ సుభాని, టి.నాని, సతీష్, రాజశేఖర్, శ్రీను, పృథ్వి, రవి, పోసి పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి -గోకవరం

గోకవరంలో లబ్ధిదారులకు ఇచ్చిన ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని బుధవారం ఆర్‌డిఒ చైత్ర వర్షిణికి వైసిపి నాయకుడు, గోకవరం ఎంపిపి సుంకర శ్రీవల్లి భర్త వీరబాబు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోకవరంలో అర్హులైన 600 మంది లబ్ధిదారులకు గత లేఅవుట్లో ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. అక్కడే మిగిలిన 200 మందిని కలుపుకుని 800 మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ఆర్‌డిఒ చైత్రవర్షిణి విజ్ఞప్తి చేశారు ఇప్పటివరకు వాటికి పట్టాలు ఇవ్వలేదని, ఇప్పటికే చాలాకాలం అయిందని ఇప్పటికైనా లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వాలని కోరారు.

చంద్రయాన్ విజయవంతంపై హర్షం

ప్రజాశక్తి-యంత్రాంగం

చంద్రయాన్-3 విజయవంతంపై జిల్లావ్యాప్తంగా హర్షాతిరేకాలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో విద్యార్థులు చంద్రయాన్, ఇస్రో అక్షరమాల రూపంలో కూర్చొని శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు.

నల్లజర్ల దూబచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చంద్రయాన్-3 ఆకారంలో కూర్చుని ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి.సుమతి మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధనా రంగంలో భారతదేశం అగ్రగామిగా నిలవాలని ఆకాంక్షించారు. **ఉండ్రాజవరం** చంద్రయాన్ విజయం ఇస్రోకి మాత్రమే కాక 140 మంది కోట్ల ప్రజలకు చెందుతుందని జెడ్‌పి పాఠశాల హెచ్‌ఎం ఎం.విశ్వ ప్రసాద్ అన్నారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులకు చంద్రయాన్ లాండింగ్‌ను టీవీల్లో చూపించారు. ఈ కార్యక్రమంలో ఐ.రాంబాబు, ఎస్.లక్ష్మీనారాయణ, ఉదయభాస్కర్, కోట రామ్ ప్రసాద్, నిరీక్ష ణ రావు, శేషేంద్ర, దుర్గాప్రసాద్, అజీబా, నాగసుందరి, పావని, అనసూయ పాల్గొ న్నారు. **కడియం** ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం టి.సత్య నారాయణ అధ్యక్షతన సభలో శాస్త్రవేత్తలను,



నల్లజర్ల మండలం దూబచర్ల జడ్‌పి పాఠశాలలో చంద్రయాన్ అక్షరమాల రూపంలో కూర్చొన్న విద్యార్థులు

ఇస్రో చేస్తున్న ప్రయోగాలను కొనియాడారు. ఉపాధ్యా యుడు జి.సత్యనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఫస్ట్ అసిస్టెంట్ రఫీ, రాజు, డేవిడ్, వీరబాబు, శరత్, సువర్ణవేణి, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు. **తాళ్లపూడి** మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ఆట స్థలంలో భారీ స్క్రీన్ టీవీని ఏర్పాటు చేసి చంద్రయాన్‌చ దృశ్యాలను తిలకించారు. తహశీల్దారు కార్యాలయంలో ఎఎస్ఒ జోడాల వెంకటేశ్వరరావు, డిటి అహ్మద్ హర్షం వ్యక్తం చేశారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు వీడ్కోలు

ప్రజాశక్తి-గోపాలపురం

ఎందరో విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్ది, ప్రతిభ వంతులుగా చేసేందుకు కృషి చేసిన ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి రాజంపాలెం పాఠశాల హెచ్‌ఎం డి.సంపూర్ణ విజయం అన్నారు. బుధవారం రాజంపాలెం హైస్కూల్లో సేవలందించి ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన హెచ్‌ఎంలు వెంప అచ్యుత మోహన్ రావు, టీచర్స్ విజయకుమార్, దీక్షితులు, స్వామి, నాగేశ్వరరావు, జ్యోత్స, కృష్ణవేణి, వెంకటలక్ష్మి సిబ్బందికి వీడ్కోలు సభ ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అనేక ఏళ్ల విద్యార్థులకు నిస్వార్థమైన సేవలు అందించారని తెలిపారు. నాణ్యమైన విద్యను అందించి స్కూల్ యొక్క ఉత్తీర్ణశాతం పెంచేందుకు ఎంతో కృషి చేశారన్నారు. అనేక సంవత్సరాలు బోధన అందించి, తోటి సిబ్బందితో



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సహోపాధ్యాయులు

ఎంతో ఆత్మీయంగా ఉండి ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లడం ఎంతో బాధగా ఉన్నప్పటికీ ఉద్యోగ బాధ్యత రీత్యా ఉద్యోగులు బదిలీపై వెళ్లడం తప్పవని వారు గుర్తు చేశారు. విద్యార్థులు ఉపాధ్యాయుల గురించి వారి యొక్క అనుభవాలు తెలిపారు. అనంతరం వారిని ఘనంగా పూలమాలలతో, శాలువలతో కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, యోగ టీచర్ మల్లిపూడి శ్రీనివాసరావు వారికి ఘనంగా వీడ్కోలు పలికారు.

గణిత శాస్త్రవేత్త సిఆర్.రావుకు ఘన నివాళి


ప్రజాశక్తి-తాళ్లపూడి

భారతదేశ ప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త ప్రొఫెసర్ సిఆర్.రావు మృతి తీరని లోటని తహశీల్దారు టి.రాధిక, గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు అన్నారు. రెవెన్యూ కార్యాలయం వద్ద రావు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గణిత, గణాంక శాస్త్రాలతో పాటు ఆర్థిక జన్యు మానవ భూగర్భ శాస్త్రాలతో పాటు పలు విభజన శాస్త్రాలలో ప్రొఫెసర్ రావు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిటి అహ్మద్, జూనియర్ అసిస్టెంట్ దీపక్, సంక్షేమ సహాయకులు భారతి, కవిత, కరుణ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

28 నుంచి డిగ్రీ ప్రవేశాలు

ప్రజాశక్తి -దేవరపల్లి

డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఈ నెల 28 నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు బిహెచ్ఎస్ఆర్ విఎల్ఎం డిగ్రీ పీజీ కళాశాల ప్రిన్సిపల్ బిడిఎన్ కుమార్ తెలిపారు. బుధవారం దేవరపల్లి బిహెచ్ఎస్ఆర్‌విఎల్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో ఆయన మాట్లాడారు. ఇంటర్ పాసైన, తత్సమాన విద్యార్హత కలిగిన అభ్యర్థులు తమ పత్రాలతో కళాశాలలో సంప్రదిస్తే ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు తెలిపారు.



టంగుటూరి ప్రకాశంకు ఘన నివాళి

ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 152వ జయంతి వేడుకలు పలుచోట్ల ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజమహేంద్రవరం జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ కలెక్టరేట్‌లో టంగుటూరి ఫోటోకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డిఆర్ఒ జి.నరసింహులు, కలెక్టరేట్ ఎఒ బివిఎస్.రామారావు, జిల్లా హౌసింగ్ అధికారి జి.పరశురామ్ పాల్గొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఇన్‌ఛార్జి ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్ టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎఎస్‌పిలు ఎస్ఆర్.రాజశేఖర్ రాజు, ఎం.రజని, జి.వెంకటేశ్వరరావు, డిఎస్‌పి (ఎస్‌బి) డి.రామవర్మ పాల్గొన్నారు. **చాగల్లు** గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు టంగుటూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి గద్దె శ్రీనివాసు, సిబ్బంది పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** మండల పరిషత్ కార్యాలయంలోఎంపిపి పాలాటి యల్లారీశ్వరి టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసిపి నాయకులు పాలాటి శరత్, ఎంపిడిఒ జివిఎస్.ఆర్కే రాజు, హౌసింగ్ ఎఇ



కలెక్టరేట్‌లో నివాళి అర్పిస్తున్న జెసి

ఎం.విక్టర్‌బాబు, పిఆర్ ఎఇ భగవాన్నారాయణ, దమ్మెన్నులో సర్పంచ్ గురజర్ల వీర వెంకట సత్యనారాయణ, చివటంలో కార్యదర్శి కెకృష్ణవేణి పాల్గొన్నారు. **తాళ్లపూడి** ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, కార్యాలయ సిబ్బంది, తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారు రాధిక, ఎఎస్ఒ జోడాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. **గోపాలపురంలో** మండలం ప్రత్యేకాధికారి డాక్టర్ సత్య గోవింద్ మండల కార్యాలయంలో, గ్రంథాలయంలో లైబ్రేరియన్ వి.సత్యనారాయణ టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి గెల్లా రాజమనోహర్, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ అనిల్, విఆర్ఒ జివివి.లక్ష్మి పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ సేవల పరిశీలన

ప్రజాశక్తి- గోకవరం

గోకవరం అచ్చయ్యపేటలో అంగన్‌వాడీ కేంద్రంలో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను బుధవారం జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా మాతా శిశు సంరక్షణ సేవలను ఎఎన్ఎమ్ పనితీరును వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమంలో ఆశ యాప్ లను ఆయన పరిశీలించారు. ఫీల్డ్ లెవెల్‌లో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆశా కార్యకర్తలకు డాక్టర్ వెంకటేశ్వరరావు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ తిరణ్, డాక్టర్ అలేఖ్య, మేరీ కప, ఎంపిహెచ్ఒ వైఎస్.రాయుడు, పాల్గొన్నారు.

25 వరకు ఓటరు గుర్తింపు సర్వే

ప్రజాశక్తి-కొవ్వూరు

కొవ్వూరు నియోజకవర్గంలో ఇంటింటి సర్వే ఈ నెల 25వ తేదీ వరకూ జరుగుతుందని కొవ్వూరు ఆర్‌డిఒ, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎస్.మల్లిబాబు తెలిపారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆర్‌డిఒ మాట్లాడారు. ఫారం 6, 7, 8 నమోదు ప్రగతి, దరఖాస్తుల పరిష్కారాల ప్రగతిని రాజకీయ పార్టీల నాయకులతో సమీక్షించినట్లు చెప్పారు. ఇప్పటివరకు జరుగుతున్న ఇంటింటి సర్వేలో కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 73,056 ఇళ్లకు సంబంధించి ఇప్పటి 98 శాతం సర్వే పూర్తయిం దన్నారు. 1,77,620 ఓట్లకు గాను 144488 తనిఖీ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేశామని తెలిపారు. చాగల్లు తహశీల్దార్, కె.రాజ్యలక్ష్మి, తాళ్లపూడి డిటి. షేక్ లాల్‌అహ్మద్, కొవ్వూరు డిటి సునీత, రాజకీయ పార్టీ ప్రతినిధులు, జె.విజయ మోహన్ కుమార్ పాల్గొన్నారు.

స్కౌట్ అండ్ గైడ్స్ శిక్షణ శిబిరం పరిశీలన

ప్రజాశక్తి- నల్లజర్ల

దూబచర్లలోని శ్రీ సంఘమిత్ర విద్యాలయలో హిందూస్తాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ శిబిరాన్ని డిస్ట్రిక్ ఆర్గనైజేషన్ కమిషనర్ కోటేశ్వరరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవేశిక పూర్తి చేసుకున్న వందమంది విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమంలో విద్యార్థులందరూ స్వచ్ఛందంగా చేరాలని అన్నారు. ఈ శిక్షణలో సత్యం పలకడం, కష్టాలలో ఉన్నవారిని ఆదుకోవడం, రోగగ్రస్తులకు సేవచేయడం, పోలీసు వ్యవస్థకు అత్యవసర సమయాల్లో సాయపడటం ద్వారా బాలభటులుగా సమాజసేవ చేయవచ్చని తెలిపారు. అనంతరం సంఘమిత్ర స్కూల్ డైరెక్టర్ అంబటి శ్రీనివాసరావు కోటేశ్వరావులకు చిరు సత్కారం చేశారు.

నేరాలు ఘోరాలు

చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని అన్నదేవరపేటలో ఈనెల 17న జరిగిన చోరీ కేసులో ఇద్దరిని అరెస్టు చేశామని ఎస్ఐ కెవి.రమణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు అన్నదేవరపేట గ్రామానికి చెందిన జాలే బంగారాజు ఇంట్లో బంగారు నగలు, నగదు చోరీకి గురైంది. ఈ మేరకు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదే గ్రామానికి చెందిన బాలగంగాధర్ అకాశపు సతీష్‌కుమార్‌లను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. వీరి నుంచి రూ.లక్ష విలువ చేసే బంగారు నగలు, రూ.70వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కొవ్వూరు కోర్టుకు తరలించామన్నారు.

కోడిపందెం ఆడుతున్న ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలో పేరవరం శివారు కోడిపందేలు ఆడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ బివి.శివప్రసాద్ తెలిపిన వివరాల మేరకు... పోలీసులకు సమాచారం అందడంతో బుధవారం సిబ్బందితో కలిసి ఎస్ఐ పేరవరంలోని కోడిపందేల శిబిరంపై దాడి చేశారు. ముగ్గురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1,090 నగదు, ఒక కోడిపుంజును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

విద్యుత్ ఉద్యోగి చేతివాటంపై విచారణ

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మున్సిపాలిటీ జి.రాగంపేట రోడ్డులోని జగనన్న లే అవుట్‌లో జగనన్న ఇళ్లకు కరెంట్ కనెక్షన్లు ఇవ్వడంలో విద్యుత్ శాఖకు చెందిన ఉద్యోగి చేతివాటం ప్రదర్శించారు. విద్యుత్ కనెక్షన్లు విషయంలో పలు అవకతవకలకు పాల్పడినట్లు అధికారులకు ఫిర్యాదులందాయి. లబ్ధిదారులకు ఎటువంటి డిపాజిట్ లేకుండానే విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టినా అందుకు విరుద్ధంగా సామర్లకోటలో విద్యుత్ శాఖ ఉద్యోగి విద్యుత్ కనెక్షన్ కోసం లబ్ధిదారుల నుంచి రూ.వేలు చొప్పున వసూలు చేశారు. లబ్ధిదారుల ఫిర్యాదు మేరకు విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగారు. లబ్ధిదారుల నుంచి వివరాలు సేకరించారు. నివేదికలో సదరు ఉద్యోగికి పెద్ద మొత్తంలో ఫోన్ పే ద్వారా సొమ్ము చెల్లించినట్లు గుర్తించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందించి సంబంధిత ఉద్యోగిపై తదుపరి చర్యలకు సిఫార్సు చేయనున్నట్లు సమాచారం.

ఇథనాల్ ఫ్యాక్టరీపై సుమోటో కేసు

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని గుమ్మళ్లదొడ్డిలో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీపై సుమోటో కేసు నమోదు చేశారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మరోతి శివగణేష్ తెలిపారు. గోకవరం ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. నియోజకవర్గంలో కాలుష్యాలు నుంచి ప్రజలను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ పోరాట యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుమ్మళ్లదొడ్డిలో ఏర్పాటు చేసే అసాగో ఇథనాల్ ఫ్యాక్టరీ వల్ల 30 నుంచి 50 కిలో మీటర్ల పరిధిలో భూగర్భ జలాలు, ప్రాణ వాయువు కలుషితమవుతుందన్నారు. దీనిపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో 281/2023, 98/2023 నంబర్లతో కేసు నమోదైందన్నారు. కార్పొరేట్ యాజమాన్యాలతో పోరాడే శక్తి ప్రజలే అందించాలని నియోజక వర్గంలో ప్రతి కుటుంబం నుంచి ఒక్కరు నెలలో ఒక్క రోజు పని దినాన్ని కాంగ్రెస్ పార్టీ పర్యావరణ పరిరక్షణ పోరాట యాత్ర కోసం కేటాయించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమమే టిడిపి లక్ష్యం

ప్రజాశక్తి - పెదపూడి

మహిళా సంక్షేమమే టిడిపి లక్ష్యమని, మహానాడులో ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగానే అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందుతుందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం అనపర్తి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జుత్తుక సూర్యకుమారి అధ్యక్షతన రాయపాలెంలో జరిగిన మహాశక్తి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటా తిరిగి మినీ మేనిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార పార్టీ సంక్షేమం పేరుతో దోపిడీ చేస్తుందన్నారు. అసలైన సంక్షేమం టిడిపితోనే సాధ్యమని వెల్లడించారు. ప్రత్యేకించి మహిళలకు మహాశక్తి పేరుతో అనేక సంక్షేమ పథకాలను చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి బేరా వెంకన్న, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శేషారత్నం, మండల అధ్యక్షులు సత్యవతి, దర్శా, అంగన్‌వాడీ సాధికారిక కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుభాషిణి, టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్టా గంగాధరచౌదరి, టిడిపి మండల అధ్యక్షులు జుత్తుక కృష్ణ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మండల సమావేశం

ప్రజాశక్తి - రౌతులపూడి

రౌతులపూడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రశాంతంగా సాగింది. ఎంపిపి గంటిమళ్ల రాజ్యలక్ష్మి అధ్యక్షతన ఎంపిడిఒ కిషోర్ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఈ సమావేశాన్ని నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు పనుల పురోగతిని సభ దృష్టికి తీసుకొచ్చారు. తొలుత ఎఎ ఈశ్వరరావు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మండలంలో వరి సాగు దిగుబడి పరిస్థితి లేదన్నారు. రైతులకు 50 శాతం సబ్సిడీపై అవరాలు అందజేసేందుకు ప్రణాళికలు చేపడుతున్నామని తెలిపారు. ఎంఇఒ ఆదినారాయణ శ్రీనివాస్ మాట్లాడుతూ నాడు-నేడు పనులను త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ ఇంటింటికి తాగునీరు అందించేందుకు జల్‌జీవన్ పనులను ముమ్మరం చేశామన్నారు. విద్యుత్ శాఖ అధికారి వెంకటరమణ మాట్లాడుతూ గ్రామాల్లో లోవోల్టేజ్ సమస్య ఉందని, దీన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామనారు. అలాగే పలు శాఖల అధికారులు పనుల వివరాలను సభ దృష్టికి తీసుకొచ్చారు.

హత్య కేసు కొట్టివేతపై ఆందోళన

కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

పిఠాపురం రూరల్ విరవాడలో 2012లో పట్టపగలు రాజకీయ కారణాలతో జరిగిన జంట హత్య కేసులో సాక్ష్యాధారాలు బలంగా ఉన్నప్పటికీ కేసును కొట్టివేయడంతో ఆగ్రహించిన మృతుల బంధువులు బుధవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. కొందరు శరీరంపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాకినాడ డిఎస్‌పి మురళీకృష్ణారెడ్డి నచ్చజెప్పడంతో కొంత సేపటికి పరిస్థితులు సద్దుమణిగాయి. అడపా భీమరాజు, పెదిరెడ్ల వెంకటేశ్వరరావు నాటి ఘటనలో హత్యకు గురైన విషయం విదితమే.



ఆవేదన వ్యక్తం చేస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

ఈ సందర్భంగా అడపా భీమరాజు కుమారుడు, ఎంపిటిసి సభ్యులు అడపా రఘు, పెదిరెడ్ల వేంకటేశ్వరరావు భార్య అచ్చివేణి తదితరులు ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. 2012 జూన్ 10న అప్పటి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీమరాజును రాజకీయ వైరుధ్యాలు ఉన్న నేపథ్యంలో దారి కాసి హతమార్చడానికి ప్రయత్నించారు. అడ్డుకోబోయిన పెద్దిరెడ్ల వెంకటేశ్వరరావును, పోతుల వీరభద్రరావుపై అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు మారణాయుధాలతో దాడి చేశారన్నారు. ఈ దాడిలో అడపా భీమరాజుతోపాటు పెద్దిరెడ్ల వెంకటేశ్వరరావు అక్కడికక్కడే మరణించారన్నారు. పోతుల వీరభద్రరావు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేరి ప్రాణాలతో బయటపడ్డారన్నారు. ఈ కేసును న్యాయమూర్తి కొట్టివేశారన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కురకుల పుల్లయ్య కేసు కొట్టివేసిన తర్వాత సోషల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టడంతో మృతుల బంధువులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. గాయాల పాలైన ప్రత్యక్ష సాక్షి పోతుల వీరభద్రరావు సాక్ష్యం చెప్పినా కేసు కొట్టి వేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులకు శిక్ష పడేలా చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



రోడ్డుపై బైఠాయించిన ఆందోళనకారులు

ఘనంగా జిల్లా స్థాయి యువజనోత్సవాలు

ప్రజాశక్తి - కాకినాడరూరల్

సెట్రాజ్ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సిఎల్ రోడ్డులోని సత్యసాయిహాలులో జిల్లా స్థాయి యువజనోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాంస్కృతిక విభాగంలో జానపద నత్యం(గ్రూపు, సోలో), జానపద గేయాలు(గ్రూపు, సోలో), జీవన నైపుణ్యంలో కథా రచన, పోస్టర్ తయారీ, ఫోటోగ్రఫీ, ఉపన్యాసం తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. జెసి ఎస్.ఇలక్కియా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సెట్రాజ్ సిఇఒ కె.శ్రీరమణి, యువజన సర్వీసుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.అప్పలస్వామి, సెట్రాజ్ మేనేజర్ కెఎస్‌వి.కాశీవిశ్వేశ్వరరావు, న్యాయ నిర్ణేతలు, సెట్రాజ్ సిబ్బంది పాల్గొన్నారు.



జెసి ఇలాక్కియాను సత్కరిస్తున్న సెట్రాజ్ అధికారులు

విజేతలు వీరే..

జానపద నత్యం (గ్రూపు)లో భవ్య గ్రూప్ ప్రథ, యామిని గ్రూప్ ద్వితీయ స్థానం, మధు గ్రూప్ తతీయ స్థానం సాధించాయి. జానపద నృత్యం (సోలో)లో పి.జాహ్నవి, ఎస్.దేవితేజస్వి, టి.లక్ష్మీశావణి వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. జానపద గేయాలు(గ్రూపు)లో లావణ్య గ్రూప్ ప్రథమ స్థానంలో నిలిచింది. జానపద గేయాలు సోలోలో ఆర్.సాయిప్రసేద ప్రథమ, వివిఎస్ఎస్.హరిణి ద్వితీయ, వి.సాహితి తతీయ స్థానంలో నిలిచారు. కథా రచనలో జి. దవిత్, పోస్టర్ తయారీలో మహ్మద్ సమీర్, ఫోటోగ్రఫీలో బి.శైలేంద్రకుమార్, ఉపన్యాసంలో ఎస్.కుందనసుష్మాసాయి, ఇ-గవర్నెన్స్‌ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎస్. కుందన్ సుష్మాసాయి, యూత్‌లో ఎస్.పావనిగాయత్రి, పర్యావరణ రక్షణపై వ్యాస రచన పోటీలో పి. మనోహర్ విజేతలుగా నిలిచారు. వీరంతా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

గ్రామాల్లోనే ఇళ్ల స్థలాలు కేటాయించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం ఏటుపట్టు గ్రామాల్లో లబ్ధిదారులందరికీ ఆయా ప్రాంతాల్లోనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని సిపిఎం బందం విజ్ఞప్తి చేసింది. ఏలేరు పరివాహక ప్రాంతంలోని 11 గ్రామాలకు సంబంధించి 1,980 మంది ఇల్లు లేని లబ్ధిదారులకు 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న రామేశంమెట్ట సమీపంలో మెట్ట భూముల్లో క్రితం ఇచ్చిన ఇళ్ల పట్టాల ప్రాంతాన్ని బుధవారం సిపిఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడేళ్ల క్రితం పట్టాలిచ్చిన పుటికీ నేటికీ ఈ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి అభివృద్ధి పనులు చేయలేదన్నారు. లబ్ధిదారులందరూ వారి సొంత గ్రామాలలో వ్యవసాయ పనులు చేసుకుంటారన్నారు. వారందరికీ 18 కిలోమీటర్ల దూరంలో ఇళ్ల పట్టాలు ఇస్తే ఎన్నో అవస్థలు పడతారన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా ఆయన దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు, సిరపరపు శ్రీనివాస్, డి.క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.



స్థలాలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

అభివృద్ధి పనుల పూర్తికి కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట జగనన్న లే-అవుట్‌లో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో నిర్దేశించిన పనులన్నింటినీ ఈనెల 28 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం సామర్లకోట మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. అనంతరం స్థానిక జి.రాగంపేట రోడ్డులోని ఐటిసి లేఅవుట్‌లో గృహ నిర్మాణాలు, ఇతర పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. ఆమె మాట్లాడుతూ శాఖల సమన్వయంతో పనులను పూర్తి చేయాలన్నారు. ఈ పనులను ఆయా శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ బి.సుధాకర్‌పట్నాయక్, డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీరమణి, మెప్మా పీడీ బి.ప్రియంవద, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, ఆర్‌డిఒ ఎన్‌వివి.సత్యనారాయణ, డిఎల్‌డిఒ పి.నారాయణమూర్తి, ప్రసాదరావు, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, తహశీల్దార్ ఎస్.లక్ష్మీనరసకుమారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించండి

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు అధికారులను ఆదేశించారు. స్థానిక 9వ వార్డు పరిధిలోని పద్మనాభ కాలనీలో బుధవారం వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు పలు సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై వైస్ చైర్మన్ స్పందిస్తూ ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పి.సత్తిబాబు, టి.సత్యభాస్కరరావు, వి.రాజా, ఎ.వీరరాఘవ, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ కృష్ణ, జీవ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలపై అవగాహనను పెంపొందించుకోవాలని సామర్లకోట ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు పేర్కొన్నారు. బుధవారం బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షతన ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం ముద్రించిన పోస్టర్లను హెచ్ఎం, ఎస్ఐ తదితరులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ టివి.రత్నం, గంగాధర్, వ్యాయామ ఉపాధ్యాయులు తాళ్లూరి వైకుంఠం, వి.రాజు, జి.గోవిందు, కె.అరుణ, ఎఎల్ఎ.కుమారి, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

తోటపేటలో 'గడప గడపకూ...'

ప్రజాశక్తి - తాళ్లరేవు

పోలేకుర్రు పంచాయతీ తోటపేట, బిసి పేట, పోలేకుర్రు గుడి ప్రాంతంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఎల్ఎ పొన్నాడ సతీష్‌కుమార్ పాల్గొన్నారు. తోటపేటలో నూతనంగా నిర్మించిన సిసి రోడ్లకు ఇరుపక్కల గ్రావెల్ వేయాలని ప్రజలు కోరారు. వెంటనే ఎంఎల్ఎ కాంట్రాక్టర్‌తో మాట్లాడి గ్రావెల్ వేయాలని ఆదేశించారు. సురక్షితమైన తాగునీరు అందించాలని మహిళలు కోరారు. సమస్యను పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మరుతీరావును సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, పంచాయతీ కార్యదర్శి జ్యోతిసుధా, ఎంపిటిసి సభ్యులు బల్ల సంధ్యారాణి, ఎంపిపి రాయుడు సునీత, మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు కాశ గోవింద కుమార్, రాయుడు గంగాధర్, దూళిపూడి బాబి, కోపనాతి నాగరాజు, దున్నా శ్రీకాంత్, భూసారపు పద్మారావు, ఉప సర్పంచ్ దడాల గణేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వడ్డి ప్రసాద్‌కు పలువురి పరామర్శ

చాగల్లు : కడియం పోలీసులు దాడిలో గాయపడిన కుంకుడుమిల్లికి చెందిన వడ్డే వెంకట ప్రసాద్‌ను జనసేన పార్టీ నాయకులు టిడి.రామారావు బుధవారం పరామర్శించారు. ఈ సంఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి కారకులను కఠినంగా శిక్షించాలని రామారావు డిమాండ్ చేశారు.

అన్నవరం కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - చాగల్లు

ఊనగట్లకు చెందిన జనసేన పార్టీ కార్యకర్త కొండేపర్తి అన్నవరం తల్లి మృతిచెందడంతో పార్టీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ టిడి.రామారావు అన్నవరం కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఊనగట్ల నాయకులు కృష్ణంగారి వెంకన్న, ఏపుగంటి నాగబాబు, కొయ్యలమూడి తేజ, బొరుసు శ్రీను, బొరుసు మణికంఠ, చాగల్లు నాయకులు కనాజీ రామాంజనేయులు, రాగిరెడ్డి దుర్గ భూషణం, బిక్కిన సురేష్ చౌదరి, రాంబాబు పాల్గొన్నారు.

యానాం వార్తలు

సిఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గంలో సిఎస్ఆర్ నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ బుధవారం తెలిపారు. ఈ మేరకు సిఎస్ఆర్ నిధులు మంజూరు చేసేందుకు సిఎస్ఆర్ కమిటీ ఆమోదించిందన్నారు. 18 పనులకు సంబంధించి రూ.2.47 కోట్లు, 33 అభివృద్ధి పనులకు సంబంధించి రూ.19.50 కోట్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అదనంగా మరికొన్ని పనులకు రూ.2.30 కోట్లు ఇవ్వడానికి సిఎస్ఆర్ కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. గతంలో చేపట్టిన నిరవధిక దీక్ష వల్ల ఈ సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా సిఎస్ఆర్ కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

సొసైటీ భూమి పట్టాదారులకు త్వరలో ఓఎన్‌జిసి నష్టపరిహారం

ప్రజాశక్తి - యానాం

స్థానిక దరియాలతిప్ప గ్రామంలో ఉన్న ఎస్‌సి ఫీల్డ్ లేబర్ సొసైటీ భూమి పట్టాదారులకు ఓఎన్‌జిసి ద్వారా రావాల్సిన నష్టపరిహారం త్వరలో మంజూరు చేయనున్నట్లు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ తెలిపారు. ఈ మేరకు పెండింగ్‌లో ఉన్న సుమారు 19 మంది పట్టాదారులకు నష్టపరిహారం త్వరలో తమ బ్యాంక్ ఖాతాలో జమ చేస్తామన్నారు.

టిడిపి అసత్య ప్రచారాలు తగదు

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

వేమవరంలో ఈనెల 22న మాజీ మంత్రులు బండారు సత్యనారాయణ సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నవారంతా వైసిపికి చెందిన వారేనని చెప్పడం ప్రచారం సత్య దూరమని జడ్‌పిటిసి ఎలిశెట్టి అమ్మిత, నరేష్, దంపతులు తదితరులు తీవ్రంగా ఖండించారు. బుధవారం పి.వేమవరంలోని వైసిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామానికి చెందిన మేడిశెట్టి రాంబాబు, ముసిరెడ్డి శ్రీరాములు ఇద్దరూ స్థానిక ఎన్నికల్లో జనసేన తరఫున పనిచేశారన్నారు. దీనికి సంబంధించిన ఫోటోలు సమావేశంలో ప్రదర్శించారు. వైసిపికి చెందిన వెయ్యి మంది టిడిపిలోకి చేరినట్లు చేస్తున్న ప్రచారం వాస్తవం కాదన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ ఎలిశెట్టి నూకరత్నం, మాజీ సర్పంచ్ ఎలిశెట్టి భీమన్న దొర, ఎంపిటిసి సభ్యులు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు గొల్లపల్లి వితరణ

కడియం : కడియం జెడ్‌పి పాఠశాల ఉపాధ్యాయుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ, తన తల్లి గొల్లపల్లి నూకమ్మ జ్ఞాపకార్థం పదహేడవతరగతి విద్యార్థులకు రూ.6 వేల విలువైన నిత్యావసర వస్తువులు అందజేశారు. పదో తరగతి విద్యార్థి హేమకు సైకిల్‌ను బహూకరించారు. అత్యధిక మార్కులు సాధించిన ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపికలను అందించారు. పాఠశాల ఉపాధ్యాయులకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన గొల్లపల్లి దంపతులను పాఠశాల హెచ్ఎం టి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు రాజు, డేవిడ్, సువర్ణవేణి, గిరిజ పాల్గొన్నారు.

టిడిపితో మహిళలకు బంగారు భవిష్యత్తు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

టిడిపితోనే మహిళలకు బంగారు భవిష్యత్తు ఉంటుందని మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు పేర్కొన్నారు. టిడిపి నిర్వహిస్తున్న భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మహాశక్తి చైతన్య రథయాత్రను 26వ డివిజన్‌లో బుధవారం నిర్వహించారు. ఆయన పాల్గొని ఇంటింటా తిరిగారు. స్థానిక సమస్యలను తెలుసుకుంటూ, మినీ మేనిఫెస్టో కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ రాబోయే టిడిపి ప్రభుత్వంలో మహిళలు బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తూ చంద్రబాబు నాయుడు మహాశక్తి పథకాలను ప్రకటించారన్నారు. మహిళలకు ఆర్థిక స్వావలంబన, రక్షణ టిడిపి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. వైసిపి ప్రభుత్వంలో మహిళలపై దాడులు పెరిగి, రక్షణ లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, చిక్కాల సత్యవతి, అన్నార్, పంతాడి రాజు, సంఘాని నాగూర్, చింతా పేర్రాజు, సంఘాని గంగాధరం, కొల్లు ప్రకాష్, సంఘాని నూకరాజు, ఆదినారాయణ, పాలెపు రాజు పాల్గొన్నారు.

హౌసింగ్ రుణాలపై నిలదీత

ప్రజాశక్తి -కరప

హౌసింగ్ రుణాలు అందించకపోవడంపై పలువురు సభ్యులు అధికారులను నిలదీశారు. కరప మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల ప్రజాపరిషత్ చంద్రన్న సమావేశ భవనంలో ఎంపిపి పెంకే శ్రీలక్ష్మి సత్తిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఎంపిడిఒ కె.స్వప్నారావు మండలంలో జరిగిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. పాతర్లగడ్డ సర్పంచ్ వాసిరెడ్డి ఏసుబాబు మాట్లాడుతూ హౌసింగ్ లబ్ధిదారులకు ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయం అందలేదని తెలిపారు. దీనిపై సభ్యులు నిలదీశారు. ఎంపిడిఒ మాట్లాడుతూ సాయం విషయమైన ప్రజలకు ఎటువంటి హామీ ఇవ్వలేదని, హౌసింగ్ అధికారులను సంప్రదించాలి' అని అన్నారు. దీంతో సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో సర్పంచులను సమావేశపరిచి హౌసింగ్ రుణాలు ఇస్తారు, ఇళ్లు కట్టుకోవాలని లబ్ధిదారులను ప్రోత్సహించాలని చెప్పారన్నారు. ఇప్పుడు అధికారులను సంప్రదించాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు వై.సుబ్బారావు, ఎంఇఒ బుల్లి కృష్ణవేణి, తహశీల్దార్ పొన్నమండ శ్రీనివాసరావు, ఎలక్ట్రికల్ ఎఇ ఈశ్వర్‌ప్రసాద్, ఆగ్రికల్చర్ ఎఒ రాజేష్ పాల్గొన్నారు.